# శ్రీధర కథలు

ఆ ఏరియా ఎమ్మెల్యే, ఎం.పి. గురించి తెలియని వాళ్లు ఉండొచ్చుగాని, ఆ చుట్టుపక్కల సీతా రావమ్మ గురించి తెలియని వాళ్లు ఎవరూ ఉండరు.
పసి నిమ్మ పండు రంగులో, మంచి గుమ్మడికాయలా పొట్టిగా గుండ్రంగా ఉండే సీతారావమ్మ ఎప్పుడూ జరీ చీరలో రూపాయి కాసంత కుంకుమ బొట్టుతో, ఏడు వారాల నగలతో నిండుగా కనిపిస్తుంది - గుళ్లో అమ్మవారిలా.
ఆమెకో మొగుడుండేవాడు. ఆయన పేరు ఎవరికీ తెలియదు. అంతా ఆయన్ని 'సీతారావమ్మ గారి మొగుడు' అనే అనేవాళ్లు. ఆయన ఆమెకు జస్ట్ కాంట్రాస్ట్. సన్నగా పొడుగ్గా గెడకర్రలా ఉండే వాడు. ఒంటిమీది అంగోస్త్రం తప్ప ఆయన నిండుగా పంచె కట్టుకుని, చొక్కా తొడుక్కుని ఎరుగడు. ఆమె ధాటికి, నోటికి తట్టుకోలేక ఆయన కాశీ పోయాడని కొందరు, అసలే పోయాడని ఇంకొందరు అంటుంటారు. ఆయన లేని లోటు ఆమెకేం కనిపించలేదు - ఏనాడూ.

## చలి చీమలు

వీధి అరుగుమీద కుర్చీ వేసుకుని కూర్చుంది. దారినపోయే వాడిని అంత దూరం నుంచే గుర్తుబట్టింది. ''రేయ్.. ఇట్రారా'' అని గర్జించింది. వాడు వచ్చి వినయంగా ఆమె ముందు నిలబడ్డాడు.

''ఏరా, ఈ నెల వడ్డీ డబ్బు ఇవ్వనే లేదు..''

''రేపు తెచ్చిస్తానమా...''

''రేపు రేపు అంటూ రోజులు నెట్టేస్తే కుదరదు..'' అన్నదామె.

''లేదమ్మా... మాట తప్పేవాడ్ని కాదు... రేపు సర్దేస్తానమ్మా...''

''సరే... ఫో'' అన్నది.

వాడు అటు పోగానే ఇంకొకడు ఇటు నుంచి వచ్చాడు.

''ఏరా నీ భార్య పురుడు పోసుకుందా?'' అని అప్యాయంగా పలకరించింది సీతారావమ్మ.

''లేదమ్మా... ఇవాళో రేపో అనేటట్టుంది... పురుడంటే మాటలా సెప్పండి... మీరే ఆదుకోవాల..'' అన్నాడు వాడు.

''ఎంత కావాలి?''

''పది వేలు ఇప్పించండమ్మా...''

''సాయంత్రం వచ్చి పట్టుకుపో....'' అన్నది సీతారావమ్మ.

''గుళ్లో అమ్మోరు పిలిస్తే పలకదండి... మీరు పిలిస్తే పలికేదైవం అండి...'' అని ఆమెను ఉబ్బేశాడు.

పొగడ్తలకు పొంగిపోని వాళ్లు ఎవరుంటారు? ఆమె ఇట్టే కరిగి పోయింది.

''సర్లేరా... మధ్యాహ్నం వచ్చి డబ్బు పట్టుకెళ్లు... నెలలు నిండాక ఏ క్షణంలో నొప్పులొస్తాయో. ఏమో...'' అన్నది.

వాడు దణ్ణాలు పెట్టుకుంటూ వెళ్లాడు.

అది మధ్యతరగతి వాళ్లు ఉన్న కాలనీ. చాలీచాలని ఆదాయం. పీకల మీద కొచ్చే అవసరాలు తీరాలంటే అప్పులు చేయాల్సిందే. చీటికిమాటికీ ఏ బ్యాంక్ వాడు వేలకు వేలు ఇస్తాడు? కిళ్లీ కొట్టు వాళ్లు, ఆటో రిక్షా వాళ్లు, తోపుడు బండి మీద కూరలమ్ముకునే వాళ్లు, తాపీ మేస్త్రీ వాళ్లు, టిఫెన్ సెంటర్ వాళ్లు - చిన్నచిన్న వ్యాపారం చేసుకునే వాళ్లు - ఆమె దగ్గరకు అప్పుకు రావల్సిందే. వాళ్లందరికీ ఆమె ఏ.టి.ఎం. లాంటిది. ఆమె దగ్గర అప్పుకు రావటానికి ఓ వేళాపాళా అంటూ ఏమీ ఉండదు. అర్ధరాత్రి వచ్చి నిద్ర లేపే వాళ్లు ఉంటారు.

సీతారావమ్మ అంటే 'ఎనీ టైం మనీ' అని వాళ్లందరికీ తెల్సు. అప్పు ఇవ్వటంలో ఎంత ఉదారమో, వడ్డీ గుంజటంలో అంత గట్టి పట్టు. రెగ్యులర్‌గా తెచ్చి ఇచ్చేవాడు అయితే, నాలుగు రోజులు ఆలస్యమైనా ఆగుతుంది. అవసరం తీరాక మొహం చాటేసేవాడు దొరికితే ముఖం వాచి పోయేలా - తిడుతుంది. అంత కఠినంగా ఉండకపోతే ఇచ్చిన డబ్బు రాబట్టుకోవటం కష్టమని ఆమెకు తెల్సు. గొప్పవాళ్ల మనసు వజ్రంలా కఠినంగాను, పువ్వులా మెత్తగాను ఉండాలనీ టీ.వీలో ఎవరో చెప్పిన మాటలు ఆమె మనసులో బాగా నాటుకున్నాయి.

ఆమె మధ్యాహ్నం భోజనం చేసి వక్క పలుకులు నోట్లో వేసుకుని తమల పాకులు ఈనెలు తీసి, సున్నం రాసుకుంటున్న సమయంలో యతిరాజులు వచ్చాడు. ఆమె ఆకులు నోట్లో పెట్టుకుంటూనే అడిగింది.

''ఏం, యతిరాజులు... ఎండన పడి వచ్చావు? కాస్త చల్లబడ్డాక రాకపోయావా?''

''నీడ పట్టున కూర్చుని తాంబూలం వేసుకుని టీ.వీలో సినిమాలు చూసుకోవటానికి మీకు కుదిరినట్లు నాలాంటి వాడికి కుదరొద్దూ...'' అని చనువుగా ఆమె కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు యతిరాజులు.

''క్లబ్బులో పేకాడటానికి కుదురుతుంది. రాత్రికి తాగటానికి కుదురుతుంది. ఏదైనా పని చేసుకుని నాలుగు రూపాయలు సంపాదించుకోవటానికి కుదరదు... ఒళ్లొంగదని చెప్పు...'' అన్నది సీతా రావమ్మ.

''నాకు ఒళ్లొంగక పోవటమేమిటి? ఎవడు చూసినా అరవ చాకిరీ చేయించుకునే వాడే గాని, పైసా విదపడే? ఎన్నాళ్లు చేస్తాను... కంచి గరుడ సేవ...'' అన్నాడు యతిరాజులు.

''ఇంతకీ వడ్డీ రాలేదు ఈ నెల...'' అన్నది సీతారావమ్మ అసలు విషయానికొస్తూ.

''ఉంటే నీకివ్వకుండా ఉంటానా చెప్పు... రెండో పిల్ల ఇంజనీరింగ్ చదువు పూర్తి అయి డబ్బు సంపాదించేదెప్పుడో గాని, ముందు పెట్టుబడి పెట్టలేక చస్తున్నాను...''

''తప్పదు గదా మరి...''

''ఇంతకీ అసలు విషయం చెప్పనే లేదు... మూడో పిల్ల పెద్ద మనిషి అయింది...''

''శుభం...''

''కరువులో అధికమాసం... ఈనెల వడ్డీ ఇవ్వలేను. అంచేత నామీద వేసే అక్షింతలు నామీద వేసి, ఓ అయిదు వేలు ఇవ్వు... తర్వాత అది నీళ్లు పోసుకుని ఇంట్లోకి వచ్చాక, మా ఆవిడొచ్చి పిలుస్తుంది. వచ్చి ఆ పిల్ల మీద నాలుగు అక్షింతలు వెయ్...'' అన్నాడు యతిరాజులు.

''తీసుకున్న అప్పు తీర్చకుండా మళ్లా అప్పు అంటే ఎలా కుదురుతుంది?''

''వడ్డీ పట్టుకునీ, మిగతాది ఇవ్వు....''

''ఎలా తీరుస్తావంట?''

''నీ రుణం ఏదోలా తీర్చుకుంటాగా?''

''ఎలా?''

''ఎలాగైనా తీర్చుకోవచ్చు. నేనేం కాని వాణ్ని కాను. ఏదోరకంగా నీకు ఉపయోగపడతాను...'' అన్నాడు యతిరాజులు లౌక్యంగా.

సీతారావమ్మ ఆలోచనలో పడింది. బ్యాంకు నుంచి డబ్బు తీసుకు రావటం, అడిగిన వాడికి అప్పు ఇవ్వటం, నోటు రాయించుకోవటం, వడ్డీ లెక్కలు కట్టడం, ఒక్కొక్కడి చుట్టూ ఒకటికి రెండు సార్లు తిరిగి డబ్బు వసూలు చేసుకు రావటం – ఈ పనులన్నీ చెయ్యటానికి నమ్మకస్తుడైన మనిషి కోసం చూస్తున్నదామె.

యతిరాజులు తమ కులం వాడే. దూరపు బంధుత్వం. పెద్దగా చదువుకోలేదు గానీ తలకాయలు మార్చగల తెలివి తేటలున్నాయి. ఓ డాక్టరు దగ్గర గుమస్తాగాను, ఓ బట్టలకొట్టులో గుమస్తాగాను, ఓ హోటల్లో కిచెన్ సూపర్‌వైజర్‌గాను, చిన్న చిన్న ఉద్యోగాలు చేసి తనకున్న పెద్ద సంసారాన్ని లాగలేక పోతున్నాడు. ఏ ఉద్యోగంలోనూ కుదురుగా ఉండలేక పోతున్నాడు. వాళ్లిచ్చే కొద్దిపాటి జీతం చాలటం లేదు. పైగా అతనికి ఉండవల్సిన వ్యసనాలన్నీ ఉన్నాయి. అందుకు ఎంత డబ్బు చాలటం లేదు. రెండు మూడు ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం సినిమాల్లో బుకింగ్ క్లర్క్‌గా ఉన్నాడు. ఎన్నాళ్లు ఉంటాడో తెలియదు.

అందుచేత – సీతారావమ్మకు యతిరాజులు అవసరం ఉంది. యతిరాజులుకు సీతారావమ్మ అవసరం ఉంది. ఎవరి ఆలోచన వాళ్లది.


''అయితే సరే మరి... నే చెప్పిన పనులు చేసిపెడుతుండు. కొద్దో గొప్పో ముట్టజెబుతుంటాను...'' అన్నది సీతారావమ్మ.

''నీ పనులు చేసిపెడితే, నువు తృప్తిపడితే, నాకు అంతకన్నా కావల్సిందింకేమీ లేదు.. ఏదో అవసరానికి అయిదూ పదీ సర్దితే చాలు..'' అని యతిరాజులు అన్నాడు.

ఇంతలో ఫోన్ మోగింది. సీతారావమ్మ రిసీవర్ అందుకుని మాట్లాడింది.

''ఏరా సీనూ, ఎలా ఉన్నావు? కోడలు ఎలా ఉంది? నాకేం? నిక్షేపంగా ఉన్నాను... సుబ్రంగా తింటున్నాను. తిరుగుతున్నాను... మీరు దగ్గర లేరన్నదే నాకు దిగులు... సంతోషం... మీరెంత ఉన్నతిలో ఉంటే నాకంత సంతోషం... నాకు కారు ఎందుకురా? నేనెక్కడికి వెళ్తానని?... నాకు డబ్బు పంపిస్తూ ఉండు... నేనిక్కడ వడ్డీలకు తిప్పి, దాన్ని ఏడాది తిరిగేటప్పటికీ రెండింతలు చేస్తాను.... అవన్నీ నేను చూసుకుంటాన్లే... పంపించావా? ఎంత?.. సరే... ఉంటా మరి...'' అని ఫోన్ పెట్టేసింది.

ఏదో





ఆలోచిస్తూ పరధ్యానంలో ఉండిపోయిన సీతారావమ్మ యతిరాజులు పిలుపుతో ఈ లోకంలో వచ్చింది.

''యతిరాజులూ, మా వాడొక లక్ష రూపాయలు పంపించాడు. నా బ్యాంక్ ఎకౌంట్‌కి ఆ డబ్బు క్రెడిట్ అయింది... చెక్ మీద సంతకం పెట్టి ఇస్తాను. డబ్బు తీసుకొస్తావా?.... నేనే వెళ్లేదాన్ని... పొద్దుటి నుంచి నడుం పట్టేసింది... తిన్నగా నడవలేక పోతున్నాను..'' అన్నది సీతారావమ్మ.

''దానికి ఇంతగా చెప్పాలా? నాకివ్వు... నేను తీసుకొస్తా... మా సినిమాహాలు బుకింగ్ డబ్బంతా నేనే కదా తీసుకెళ్లి బ్యాంకులో వేసేది..'' అన్నాడు యతిరాజులు.

ఆమె చెక్ మీద సంతకం చేసి ఇచ్చింది. ఒక గంటలో డబ్బు తెచ్చి ఇచ్చాడు.

సీతారావమ్మ మంచం మీద పడుకునే ఉంది. లేచి కూర్చోవటం కష్టమై పోతోంది.

''నువ్వేమీ అనుకోకపోతే నేను కాస్త అమృతాంజనం రాసి రుద్దుతాను...'' అన్నాడు ఆమె బాధ చూడలేక

''సాయంత్రం పని మనిషి వస్తుంది లే...'' అన్నదామె.

''సాయంత్రం దాకా ఇలా మూలుగుతూ కూర్చుంటావా? సామెత చెప్పినట్లు గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకోవట మంటే ఇదే మరి ... లేవలేక కూలబడితే ఏ ఎముకో విరిగితే, చివరకు ఆపరేషన్ల దాకా తెచ్చుకుంటావ్...'' అని మందలించాడు.

అమృంతాజనం చేత్తో తీసుకుంటూ అన్నాడు. ''హాస్పటల్‌లో చేరితే డాక్టర్లు, నర్సులూ, పని వాళ్లు అంతా ఆడాళ్లే ఉంటారా? మగడాక్టర్లూ ఉంటారు... ఆడ నర్సులు ఉంటారు... రోగం వచ్చి నప్పుడు ఇలాంటి పట్టింపులు పెట్టుకుంటే ఎలా?''

ఆమె వద్దంటున్నా యతిరాజులు ఆమెకు సేవ చేశాడు... ఆమె మగవాడి స్పర్శకు దూరమై ఎన్నో ఏళ్లు అయింది. ఇవాళ ఇలా యతిరాజులు వద్దంటున్నా చొరవ తీసుకుంటుంటే ఆమె కాదంటూనే ఉంది. అతను వినలేదు. క్రమంగా ఉపశమనం అనిపించింది.

''ఇలాంటప్పుడే మనిషికి మనిషి సాయం అవసరం... నీకు డబ్బు ఉంది. లంకంత కొంప ఉంది. వంగి వంగి దణ్ణాలు పెట్టే వాళ్లు. నీ ఉప్పుతిని బతికే వాళ్లు వందమంది ఉన్నారు. అయినా ఏం లాభం? మంచం దిగలేనప్పుడు కాస్త చేతిసాయం చేసే మనిషి ఉండాలి. అందుకే తోడు నీడా అన్నారు. ఎప్పుడు ఎలా ఉంటామో తెలియదు... ఏ ఆపద ముంచుకొస్తుందో తెలియదు. ఎవడికి ఏ దుర్బుద్ధి పుడుతుందో తెలియదు.. ఇదివరకటి రోజులు కావు... ఒంటరి దానివి... ఆడదానివి.... ఒంటి నిండా నగలు... ఇంటినిండా డబ్బు... ఎవడన్నా ఇంట్లో చొరబడి కత్తి తీశాడనుకో... నీ పరిస్థితి ఏమిటి? లేచి వాడితో కలబడి కత్తి లాక్కోగలవా?... పోనీ వేగంగా పరుగెత్తగలవా?... రోజూ పేపర్లలో ఎన్ని చూస్తున్నాం... మన జాగర్తలో మనం ఉండాలి... ఏమంటావ్?'' అని ఆమెను మెల్లిగా



తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు.

''నిజమేననుకో... కానీ ఎవర్ని నమ్మేటట్లుంది చెప్పు...'' అన్నది సీతారావమ్మ రాజీ ధోరణికొస్తూ.

''నేనున్నాను కదా... నే చూసుకుంటాను.. నువ్వు అలా పైపైన అజమాయిషీ చేస్తుండు...'' అంటూ ఆమె వీపున చెయ్యి వేసి నెమ్మదిగా పడుకోబెట్టాడు.

ఇక అక్కడ్నించీ యతిరాజులు డ్యూటీ ఆమె ఇంట్లోనే... ఉదయం ఎనిమిదింటికల్లా వచ్చేసేవాడు. టిఫెన్, కాఫీ అక్కడే... తొమ్మిందింటికి సైకిలెక్కి వడ్డీ వసూళ్లకు బయల్దేరే వాడు. కొంతమందికి అనుమానం వచ్చి అడిగితే, 'యతిరాజులుకి వడ్డీ ఇచ్చెయ్యండి' అని చెప్పేది. డబ్బు తేవటం, ఎవరికి ఎంత ఇవ్వాలో, ఎవరి దగ్గర ఎంత వడ్డీ వసూలు చేయాలో – లెక్కా పద్దులూ అన్నీ తనే చూసుకుని సాయంత్రానికి ఆమెకి డబ్బు లెక్క చూపించి ఇచ్చేవాడు. అంత నమ్మకంగా పని చేసే మనిషి దొరకటం, ముఖ్యంగా ఊరి మీద పడి, బకాయిపడ్డ వాళ్లను పట్టుకుని, పీడించి వసూలు చేసుకు రావటం సీతారావమ్మకి ఎంతో సంతోషాన్నిస్తోంది.

బయట వ్యవహారాలే కాదు. ఇంటి వ్యవహారాల్లోనూ యతిరాజులు అతి చొరవ చూపిస్తున్నాడు. ఒక మేకు కొట్టాలన్నా తాడు కట్టాలన్నా, బల్బు మార్చాలన్నా – ఆమె చెప్పకుండానే అన్నీ చేసుకు పోతుంటాడు.

ఆమె రోజూ పూజ చేస్తుంది. నైవేద్యం దేవుడికి పెట్టాక , ప్రసాదం యతిరాజులుకు పెడుతుంది. ఆమె మధ్యాహ్నం నిద్ర లేచేటప్పటికి యతిరాజులు హోటలు నుంచి ఇద్దరికీ టిఫెన్ తెచ్చేవాడు. ఆమె కాఫీ పెట్టేది. ఇద్దరూ డైనింగ్ టేబులు మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తినే వాళ్లు.

సాయంత్రం ఆమె గుడికో, షాపింగ్‌కో వెళ్తే యతిరాజులు ఆటో తెచ్చేవాడు. ఇద్దరూ కల్సి వెళ్లే వాళ్లు.

ఆమెకు మళ్లీ కాలు బెణికింది. నడవలేక పోయింది. యతిరాజులు భుజం పట్టుకుని నాలుగు అడుగులు వేయగలిగింది. అలాగే డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాడు. టాబ్లెట్లు ఇచ్చాడు. ఆయింట్‌మెంట్ రాయమన్నాడు. లావు తగ్గకపోతే, ఇలా ప్రాబ్లమ్స్ వస్తూనే ఉంటాయన్నాడు. రాత్రిళ్లు ఆమె మంచం దిగి బాత్‌రూంకి వెళ్లటం కష్టమయ్యేది. అందుకని యతిరాజులు ఆమె గదిలోనే పడుకున్నాడు.

యతి రాజులుకి భార్య ఉంది. నలుగురు ఎది

గిన ఆడ పిల్లలున్నారు. వాళ్ళల్లో ఎవరన్నా వచ్చి ఆమెకు సాయం చెయ్యవచ్చు. కానీ ఆ ఆలోచన రానివ్వలేదు సీతారావమ్మ గాని, యతిరాజులు గాని.

ఒక ఆడ మనిషినీ, ఒక మగ మనిషినీ ఏకాంతంగా ఒకచోట వదిలేస్తే ఏం జరుగుతుందో అందరికీ తెల్సు... అలాగా తెల్సి పోయింది.. చూసిన వాళ్ల ద్వారా కొంత... చూడని వాళ్ల ద్వారా కొంత...

సీతారావమ్మకి ఇప్పుడు యతిరాజులు లేకుండా రోజు గడవదు. ఆమె సాయం లేకుండా అతనికీ రోజులు గడవవు...

ఇదిలా ఉండగా–

అప్పుల వాళ్ల దృష్టిలో ఇద్దరూ చులకన అయ్యారు. ఇదివరకు ఇంటికొచ్చి వడ్డీ ఇచ్చే వాళ్లు. ఇప్పుడు వెంట పడ్డా తప్పించుకు తిరుగుతున్నారు.

అందుచేత యతిరాజులు గట్టిగా నిలదీస్తున్నాడు. వాళ్లు తలెగరేసి పోతున్నారు. ఒకరిద్దరు ఎదురు సమాధానం చెబుతున్నారు కూడా.

రెండేళ్లకోసారి సీతారావమ్మ కొడుకు, కోడలు ఇండియా వచ్చి రెండు వారాలూ ఉండి వెళ్తుంటారు. ఇప్పుడూ అలాగే వచ్చారు.

ఈ రెండు వారాలూ యతిరాజుల్ని ఇంటికి రావద్దని చెప్పింది సీతారావమ్మ. పని మనిషికే మరింత డబ్బు ఇచ్చి పగలంతా ఇంట్లో ఉంచుకుంది చేతికింద సాయంగా.

అందరూ రెండు రోజులు తిరుపతి, రెండు రోజులు బెంగుళూరు వెళ్లొచ్చారు. శంషాబాద్ స్థలాలు కొనాలని చూసొచ్చారు. మిగిలిన సమయం అంతా షాపింగ్‌తో సరిపోయింది.

ఇంక రేపు కొడుకూ, కోడలూ తిరిగి ప్రయాణమవుతున్నారు. సాయంత్రం ఇంటిముందు ఖాళీ స్థలంలో కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. సీతారావమ్మను అమెరికా రమ్మన్నారు. ఆ టిక్కెట్లు డబ్బులతో ఎంత వడ్డీ రాబట్టుకోవచ్చో లెక్క చెప్పింది సీతారావమ్మ.

''డబ్బు ముఖ్యమైనదే... అదిలేనిదే రోజు జరగని మాట వాస్తవమే. కానీ జీవితంలో డబ్బుతో కొనలేనివి కూడా ఉంటాయి. వాటిని పోగొట్టుకున్నప్పుడు గానీ, వాటి విలువ తెలియదు'' అన్నాడు ఆమె కొడుకు.

ఇంతలో ఇంటిముందు గుమ్మంలో పెద్దగా అరుపులు వినిపించడంతో అందరి దృష్టి అటు మళ్లింది.

వచ్చిన వాడు జకరయ్య. మున్సిపాల్టీలో క్లాస్ ఫ్లోర్ ఎంప్లాయి. ఆరు నెలల కిందట ఆరు వేలు అప్పు తీసుకున్నాడు. పైసా వడ్డీ కట్టలేదు. మధ్యాహ్నం వాడు యతిరాజులకి కనపడ్డాడు. వడ్డీ కట్టనందుకు యతిరాజులు తిట్టాడు.

ఆ కోపంతో కల్లు కాంపౌండుకెళ్లి పీకలదాకా తాగి సీతారావమ్మ ఇంటికొచ్చి నోటికొచ్చినట్లు తిట్టటం మొదలు పెట్టాడు జకరయ్య.

''నన్ను పైసలడగడానికి వాడెవడే? నువ్వు పైసలిస్తే వాడు అడుగుతుండేది? వాడికి నీకు ఏంటి? లింకు ఏంటి? వాడితో నీకేంటి సంబంధం... చెప్పవే... చెప్పు... నీ వ్యవహారం నాకు దెల్వదను కున్నావే?'' అంటూ అరుస్తున్నాడు.


సీతారావమ్మ కొడుక్కి తలకొట్టేసినట్లుంది. గుమ్మం దగ్గర కొచ్చి వాడ్ని తిట్టాడు.

''రేయ్... ఎవడ్రా నువ్వు... ఏమిటీ పిచ్చివాగుడు... ఫో.. ఇక్కడి నుంచి అవతలికి ఫో...'' అని కసిరాడు.

''నేనెవడో నీకు తెలియదురా... నీ యమ్మకి తెల్సు. నీ యమ్మకీ వాడికి ఏంటి సంబంధం? ఉంచుకుంటే ఉంచుకోవచ్చు. కానీ నన్ను పైసలు అడిగే దానికి వాడెవడు?'' అని మళ్లీ తిట్ల పురాణం అందుకున్నాడు జకరయ్య.

చేసేది లేక తలుపులు మూసేశాడు సీను. జకరయ్య మాత్రం తాగిన మత్తు వదిలేదాకా వాగుతూనే ఉన్నాడు.

అనుకోని ఈ సంఘటనతో సీతారావమ్మ పరువుపోయింది. అదీ కొడుకు, కోడలు ముందు. ఆ షాక్ నుంచి కోలుకోవటం సీతారావమ్మ చేత కాలేదు.




మర్నాడు కొడుకు, కోడలూ – బయల్దేరేదాకా ఆమె మొహం మీద మబ్బులు కమ్ముకునే ఉన్నాయి. వాళ్లు అటు టాక్సీ ఎక్కగానే ఆమె బెడ్ రూంలో మంచం మీద పడి కుమిలి కుమిలి ఏడ్చింది.

అమెరికా చేరాక సీను తల్లికి ఫోన్ చేశాడు. ''ఊపిరాడుతున్నంత సేపు గాలి విలువ తెలియదు. ముక్కులు బిగేసి ఊపిరి అందనప్పుడే గాలి విలువ తెలుస్తుంది. అలాగే పరువుగా ఉన్నంత కాలం దాని విలువ తెలియదు. పరువు పోయినప్పుడే దాని విలువ తెలుస్తుంది... ఇంక నువ్వు వడ్డీ వ్యాపారం మానెయ్...'' అని చెప్పాడు.

సీతారావమ్మ నీరసించి పోయింది. సీను డబ్బు పంపటం మానేశాడు. అప్పుల వాళ్లు తిరిగి ఇవ్వటం మర్చిపోయారు. వడ్డీ వసూలు చేసే వాడు లేడు. ఎవరు ఎంత ఇచ్చారో, ఎంత ఇవ్వాలో కూడా ఆమెకు తెలియదు.

నిన్నటి దాకా అందరూ ఆమెను పిలిస్తే పలికే దైవం అన్నారు. ఇవాళ ఆ దైవం మొహం చూసే వాడు లేడు.

సీతారావమ్మ జబ్బు పడి లేచింది. తిండి సయించటం లేదు. సగానికి సగం అయింది.

ఒకరోజు యతిరాజులు వచ్చాడు. సీతారావమ్మ అతన్ని చూసి కన్నీళ్లు పెట్టుకుంది.

''ఏంటి ఇంత చిక్కి పొయ్యావు?'' అని అడిగాడు.

''డాక్టరు సన్నబడాలని అన్నాడుగా...''

''అంటే మాత్రం... ఇంత చిక్కిపోవాలా?''

''అందరి చేతిలోను చిక్కిపోయాను... ఆ డబ్బు ఎలా వస్తుందో తెలియదు. ఇది వరకటిలా గట్టిగా నిలదీయ లేకపోతున్నాను. నన్ను వాళ్లు అదోలా చూస్తున్నారు. వెకిలిగా నవ్వుతున్నారు... చిక్కి పోయాను...'' అన్నది ఏడుస్తూ.

వారం రోజుల తర్వాత సీతారావమ్మ పని మనిషి పొద్దుటే వచ్చి యతిరాజుల్ని నిద్ర లేపింది.

''ఆ యమ్మ చనిపోయింది...'' అని చెప్పి వెళ్లింది.

యతిరాజులు ఆదరాబాదరాగా వెళ్లాడు. మంచం మీద అలాగే నిర్జీవంగా పడుకుని ఉంది. భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది.

నిన్నటి దాకా ఆమెకు దణ్ణాలు పెడుతూ, వినయంగా ఆమె ముందు నిలబడ్డ వాళ్లల్లో ఒక్కడు... ఒక్కడైనా తిరిగి చూడలేదు.

పుట్టటం, గిట్టటం సహజమే. కానీ బలవంతమైన సర్పం చలిచీమల చేత చిక్కి.... చిక్కి... పోవటమే బాధాకరం.

ఫోన్ మోగింది. యతిరాజులు రిసీవర్ అందుకున్నాడు.

సీను అమెరికా నుంచి ''అమ్మా.... అమ్మా...'' అంటున్నాడు.

యతిరాజులు గొంతు ఎండిపోయింది. మాటలు రావటం లేదు.

★